10092024-DIS-04_Layout 1 9/10/2024 3:53 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

మణిపూర్‌లో డ్రోన్ దాడి

ఏడాదికి పైగా కొనసాగుతున్న మణిపూర్ తెగల మధ్య ఘర్షణలు ఈ మధ్య మరింతగా పెచ్చరిల్లుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ముఖ్యంగా బీరేన్ సింగ్ కుకీలపై దాడులను ప్రోత్సహించినట్టు తెలిపే ఆడియో టేపులు బహిర్గతమైన తర్వాత ఘర్షణలు భగ్గుమన్నాయి. ఈ టేపులను మీడియా సంస్థ 'ది వైర్' మణిపూర్ హింసాకాండపై కేంద్రం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్‌కు అందజేసిన నేపథ్యంలో మొన్న సెప్టెంబర్ 1న ఓ గ్రామంపై డ్రోన్లతో బాంబుదాడులు జరపడం దేశాన్ని దిగ్భ్రాంతి పరిచింది. ఈ దాడిలో ఇద్దరు సామాన్య పౌరులు మరణించారు. మిలిటెన్సీలో డ్రోన్ల సాంకేతికత ప్రవేశించడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నది. దీనిపై కుకీ, మెయితీ తెగలు ఒకరి మీద మరొకరు ఆరోపణలు చేసుకున్నారు. సంచలనం సృష్టించిన ఆడియో టేపుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం బీరేన్ సింగ్ ఈ దాడి జరిపించినట్టు కుకీ సంఘాలు ఆరోపించాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఒక వర్గానికి అనుకూలంగా పనిచేస్తుండటం వల్లే మణిపూర్ మంటలు ఆరడం లేదనే ఆరోపణలున్నాయి. కొండ ప్రాంతాల్లో నివసించే కుకీలు, మైదాన ప్రాంతాల్లో నివసించే మెయితీల మధ్య నెలకొన్న వైరం గత ఏడాది మే నెలలో ప్రత్యక్ష ఘర్షణలకు, దాడులకు దారితీయడం తెలిసిందే. అప్పటినుంచీ వివిధ స్థాయిల్లో ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. బీరెన్ సింగ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మెయితీల పక్షం వహిస్తూ కుకీల అణచివేతకు తోడ్పడుతున్నదనే ఆరోపణలున్నాయి. అల్లర్ల కారణంగా రెండు తెగలకు చెందిన 60 వేల మందికి పైగా పౌరులు స్వరాష్ట్రంలోనే కాందిశీకులుగా గడుపుతున్న పరిస్థితి నెలకొన్నది. ఘర్షణల్లో 220 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఇరు వర్గాల వారు ఉన్నప్పటికీ కుకీలే అధికమని గణాంకాలు తెలియజేస్తున్నాయి. మహిళలపై కనీవినీ ఎరుగని రీతిలో అమానుషమైన దాడులు జరగడం మణిపూర్‌కు మచ్చ తెచ్చింది. అసాధారణమైన రీతిలో సంవత్సర కాలం పైగా మణిపూర్ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. పది మంది దాకా కుకీ సభ్యులు ప్రాణభయం కారణంగా ఈ సమావేశాల్లో పాల్గొనలేక పోవడం గమనార్హం.

మణిపూర్‌లో మారణహోమాన్ని ఆపేందుకు కేంద్రం జోక్యం చేసుకోకపోగా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నది. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటివరకు మణిపూర్ గురించి, అక్కడి మహిళలపై జరుగుతున్న ఘోరాల గురించి మాట్లాడకపోవడమే ఇందుకు నిదర్శనం. బీజేపీ ప్రభుత్వం అక్కడ అధికారంలో ఉండటమే ఇందుకు కారణమని వేరే చెప్పాల్సిన పనిలేదు. దీంతో పౌర ప్రభుత్వ పాలన పట్టు తగ్గిపోయి మిలిటెంట్ గ్రూపుల హవా పెరిగింది. అరాచకత్వం ప్రబలిపోయింది. దాడులే కాకుండా వసూళ్లు కూడా జరుగుతున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఇది ఏ మాత్రం ఉపేక్షించదగిన విషయం కాదు. కేంద్రం ఇప్పటికైనా స్వపక్ష, విపక్ష తేడాలు పక్కన పెట్టి రాజధర్మాన్ని అమలుచేయాల్సిన అవసరం ఉన్నది. ఘర్షణ పడుతున్న ఇరువర్గాల మధ్య సఖ్యతకు చర్చలు జరిపి పరిష్కారం కనుగొనకపోతే డ్రోన్ల స్థానంలో ఇంకేం సాంకేతికత వచ్చిచేరి ఎలాంటి ఉత్పాతం సృష్టిస్తుందో ఊహించడం కష్టమేమీ కాదు.

రుణమాఫీపై 'లెఫ్ట్' పార్టీల దొంగ నిద్ర

టంకశాల అశోక్

రుణమాఫీ విషయమై రాష్ట్రంలో లక్షలాది మంది రైతులు ఆందోళన చెందుతూ, ఆత్మహత్యలకు సైతం పాల్పడుతుండగా వామపక్షాలు దొంగ నిద్ర పోతున్నాయి. వాటితో పాటు, రైతుల బాగు కోసం అంటూ చలామణీ అయ్యే ఎన్జీవో సంఘాలు, రాష్ట్రాభివృద్ధి కోసం తపించిపోతున్నామనే మేధావి బృందాలు, అన్నీ దొంగ నిద్రలు పోతున్నాయి. రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీని, ఎటువంటి షరతులూ లేకుండా, ఒకే దఫాలో, తాము గత డిసెంబర్ 7న అధికారానికి రాగానే 9వ తేదీన మాఫీ చేయగలమని కాంగ్రెస్ ప్రభుత్వం బాండ్ పేపర్లపై రాసి, ఇంటింటికి తిరిగి ఇచ్చిన మాట అమలు కాలేదని వీరందరికీ తెలుసు. ఆ ప్రకారం చేయని ప్రభుత్వం ఆగస్టు 15 అంటూ కొత్త గడువు పెట్టింది. అనగా గడువును 8 నెలలు పొడిగించటమన్న మాట. ఈ మూడు వర్గాల వారు బహుశా ఇది కొత్త ప్రభుత్వం గదా, ఇంకా కుదుటపడాలి గదా, ఆగస్టు 15 వరకు వేచి చూద్దామని అనుకుని ఉండవచ్చు. అదే గాని జరిగి ఉంటే ఆ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కానీ, ఇపుడు ఆగస్టు 15 గడిచి మరో నెల కావస్తున్నది.

మాఫీ అరకొరగా జరిగిందని స్వయంగా ప్రభుత్వం, దానితో పాటు మంత్రులు చెప్తున్న లెక్కలతోనే స్పష్టమవుతున్నది. ఈ స్థితి వల్ల రైతులు అంతటా ఆందోళనలు చేస్తుండటమే గాక ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. మరి వామపక్షాలు, రైతు ఎన్జీవోలు, మేధావులు తమ దొంగ నిద్ర నుంచి మేల్కొనేది ఎప్పుడు? రుణమాఫీ పూర్తయిపోయిందని ముఖ్యమంత్రి వాదిస్తుండగా, ప్రభుత్వం అధికారిక ప్రకటనలో రూ.17,000 కోట్లు మాత్రమే అన్నది. వ్యవసాయ మంత్రి తుమ్మల తాజాగా ఈ నెల 8న మాట్లాడుతూ, ఈ పంట కాలంలోనే పూర్తిచేస్తామని సెలవిచ్చారు! ఎంత అద్భుతంగా ఉంది ఇదంతా!

ఇంత జరుగుతున్నా వీరు నిద్ర నటించటానికి కారణం బహుశా ఒకటై ఉండవచ్చు. ఉభయ కమ్యూనిస్టులలో సీపీఐకి మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ నుంచి భిక్ష అనదగ్గ విధంగా ఒక సీటు దక్కింది. స్వయంగా క్షీణించిపోయి, తమలో తమకు ఐక్యత లేక, చిరకాలంగా అసెంబ్లీలలో ఒక్క స్థానమైనా లేక, సొంత బలం పెంచుకొని గెలిచే శక్తి సామర్థ్యాలు లేక, ఎడారిలో నీటి చుక్క కోసం అంగలార్చుతుండిన ఈ పార్టీ, సీపీఎంతో తెగదెంపులు చేసుకొని అయినా ఒక సీటు సంపాదించుకోగలగటంతో, తెలంగాణలో సోషలిస్టు వ్యవస్థను స్థాపించగలిగినంతగా పరవశించిపోయింది. అయితే, కమ్యూనిస్టు పార్టీగా పరువును కాపాడుకోవాలి గనుక, సిగ్గుబిళ్ల వంటి ప్రకటన ఒకటి చేసింది. అది, ప్రజల సమస్యలపై మాత్రం రాజీ పడబోమని. ఆందోళనలు చేస్తూనే ఉంటామని. ఇటువంటి ప్రకటనను ఎవరైనా నమ్మారేమో తెలియదు. బహుశా వారి పార్టీ వారు కూడా నమ్మి ఉండకపోవచ్చు. ఎందుకంటే, పార్టీ నాయకత్వం ప్రజల సమస్యల గురించి మొక్కుబడిగా మాట్లాడటం తప్ప, వాస్తవంలో గాలికి వదిలేసిందని, నాయకులలో అందరికీ కాకున్నా చాలామందికి తాము బూర్జువా పార్టీలని ముద్దుగా పిలిచే పార్టీలను ఆశ్రయించి సీట్లు సంపాదించటం, పైరవీలు చేయటం, డబ్బు సంపాదన, పిల్లలను బాగు చేసుకోవటం పరమ లక్ష్యంగా మారిపోయిందని స్వయంగా వారి పార్టీలోని శ్రేణులే బాధపడుతూ చెప్పుకొంటున్నాయి.

ఇదంతా కొద్దిపాటి తేడాలలో సీపీఎంకు కూడా వర్తిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఈ విధమైన భావన సీపీఐలో సాధారణ స్థాయి అసంతృప్తిగా ఉండగా, సీపీఎంలో తీవ్రస్థాయి అసంతృప్తిగా కనిపిస్తున్నది. సీపీఐ శ్రేణులకు తమ పార్టీ ఎప్పటి నుంచో ఒక 'గాన్ కేస్' వంటిది. ఏ ఆశలూ లేవు. ఏదో కాలక్షేపం చేస్తున్నారు. ఇందుకు భిన్నంగా సీపీఎం తమది సైద్ధాంతిక నిష్ఠ గల సంస్థ అని చెప్పుకొని వీరాలాపాలు ఆడుతూ, కార్యకర్తలకు, సీనియర్లకు కూడా ఆశాభావాలు రేకెత్తించింది. కానీ ఈ రోజున, దశాబ్దాలుగా అంకిత భావంతో పనిచేస్తున్న సీనియర్ల నుంచి యువకుల వరకు, వివిధ అనుబంధ సంస్థల కార్యకర్తల వరకు ఎవరిని కదిలించినా, బయటకు మాట్లాడలేకున్నా, ఎవరైనా వారితో విడిగా కలిసి మాట్లాడితే లోలోపల రగిలిపోతున్నారు. ఇది గమనించినప్పుడు, సీపీఐ సంగతి 'గాన్ కేస్' గనుక సరే గాని, సీపీఎం లోనూ ఇంత అసంతృప్తి ఉందా అని ఆశ్చర్యం కలుగుతుంది. సీపీఐతో పాటు ఈ పార్టీ కూడా గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్‌తో, కాంగ్రెస్‌తో బేరసారాలు ఆడినటువంటిదే. బేరం ఎవరితోనూ కుదరలేదు. ఆ అదృష్టం సీపీఐని వరించింది. అయితే, నిత్య సత్యం వంటి ఎర్రజెండాను ఆకాశంలో రెపరెపలాడిస్తూనే ఉండాలి గనుక, ప్రజా సమస్యలపై పోరులో రాజీ ఉండదని సీపీఐ వలెనే వీరు కూడా కార్టన్ కాపీ ప్రకటన ఒకటి చేశారు.

రైతు రుణమాఫీపై, ఆత్మహత్యలపై ఈ రెండు పార్టీలూ, తమ రాజకీయ భిక్షా ప్రదాత అయిన కాంగ్రెస్‌కు ఎక్కడ బాధ కలుగుతుందో అని, చిన్నపాటి స్వరంతో మొక్కుబడి ప్రకటనలు ఏవో ఒకటిరెండు సార్లు చేసినట్లున్నాయి. ఆందోళనలు మాత్రం ఏవీ లేవు. అయితే ఇందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఎందుకంటే, అసలు మౌలికంగా వీరిలో చేవ చచ్చిపోయింది. చచ్చిపోయి చాలా కాలమైంది. ఆ వాస్తవాన్ని గ్రహించేందుకు ఎంతో వెనుకకు వెళ్లనక్కరలేకుండా, రాష్ట్ర విభజన జరిగిన 2014కు పోదాము. ఆ కొత్తలో వీరిద్దరు సమావేశమై విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఏమున్నది? తెలంగాణ వెనుకబడిన సమాజం. ఇక్కడ వివిధ వర్గాల పేదలు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ గడ్డకు ఉద్యమాల చరిత్ర ఉంది. ఇక్కడ కమ్యూనిస్టులకు ఉద్యమ త్యాగాల చరిత్ర ఉంది. ఈ పరిస్థితులను ఆధారం చేసుకుంటూ మనం అధికార పక్షానికి (అపుడు టీఆర్ఎస్) ప్రత్యామ్నాయం కాగలం. అట్లా కావాలి. ఇదీ వారి ప్రకటన సారాంశం.

> **2014 ఎన్నికలు గాక, ఆ ప్రకటన తర్వాత పదేండ్లు, మరి రెండు ఎన్నికలు గడిచాయి. ఈ కాలంలో వారు చేసిన ఉద్యమాలేమిటో, ప్రత్యామ్నాయంగా ఎదిగిందెంతో, ఈ రోజున పరిస్థితి ఏమిటో, అసలు ముందుగా వారిద్దరి మధ్య మిగిలిన ఐక్యత ఏ మేరకో వివరించి చెప్తే, కామ్రేడ్స్ ఇద్దరూ బాధ పడుతారు. వారి నాయకులు బాధపడితే విచారించవలసింది లేదు.**

కానీ, మంచికో, చెడుకో మరి చేసేదేమిటో బోధపడకనో, సిద్ధాంతం పట్ల భక్తితో ఇంకా అక్కడ అంటిపెట్టుకొని ఉన్న కార్యకర్తలు బాధపడుతారు. దాదాపు వారంతా రైతు కుటుంబాల నుంచి, వృత్తి పనుల కుటుంబాలకు చెంది వ్యవసాయ ఆర్థిక స్థితిపై ఆధారపడే నేపథ్యం నుంచి వచ్చినవారు. రుణమాఫీ గురించి, రైతులకు పెంచి ఇస్తామన్న రైతుబంధు గురించి, రైతు బీమా గురించి, పంట బోనస్ గురించి తమ పార్టీలూ, రైతు సంఘాలూ ఈ విధంగా దొంగ నిద్రలు పోతుండటంపై వారు అయోమయంతో బాధపడుతున్నారు. మరెంత కాలానికైనా, మరెందరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాతనైనా వీరి నిద్ర వదలుతుందేమో మన వలెనే వారికీ బోధపడటం లేదు. అయితే, ప్రజాస్వామ్యం ఎక్కడ అంటూ 'బూర్జువా' పార్టీలను ప్రశ్నించే వీరు సొంత పార్టీలోని గొంతులను తొక్కివేస్తారు గనుక, ఆ అసంతృప్తి బయటకు వినిపించటం లేదు.

రైతు ఎన్జీవోలు, మేధావి బృందాల విషయానికి వస్తే, ప్రచార రథాలకు జెండాలూపి, స్వయంగా ప్రచారాలు చేసి, బీఆర్ఎస్‌ను ఓడించిన ఆనందం నుంచి వారు ఇంకా తేరుకున్నట్లు లేరు. వివిధ కారణాల వల్ల వారి పరమోద్దేశం బీఆర్ఎస్‌ను ఓడించటమే తప్ప తెలంగాణ ప్రజలు బాగుపడటం కాదు. రైతుల సంక్షేమం, నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధులు, విద్యారంగం బాగుపడటం, శాంతి భద్రతలు, మత సామరస్యత, మహిళల భద్రత వంటివేవీ కాదు. అందువల్లనే ఎన్నికల సమయంలో ఉన్నవి లేనివన్నీ కల్పించి ప్రచారాలు చేసినవారు, తాము కోరుకున్న కాంగ్రెస్ పాలనలో ఏమి జరిగినా ఏమి జరగకున్నా తమ ఆనంద నిద్ర నుంచి, లేదా దొంగ నిద్ర నుంచి, మేలుకోవటం లేదు. ఎన్జీవోలలో కొందరికి రాష్ట్ర విభజన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతిన్నాయి. దెబ్బతింటాయని తెలిసే తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించారు. చివరికి విభజనతో వారికి పట్టలేని ఆగ్రహం కలిగింది. బీఆర్ఎస్‌పై కక్షగట్టారు. ఆ పార్టీ పాలనలో రైతులకు ఎంత మేలు జరిగినా దానిని ఇసుమంతైనా గుర్తించకపోవటమే గాక నిరంతరం విషం చిమ్ముతూనే పోయారు. రాజకీయ కారణాలతో సీట్లు ఇవ్వక బీఆర్ఎస్‌పై ఆగ్రహం కలిగిన వామపక్ష రైతు సంఘాలు వీరికి తోడయ్యాయి. ఆ విధంగా ఈ ఉభయులు కలిసి కాంగ్రెస్ హామీలను ఆకాశానికెత్తారు. వాటి గురించి ప్రజలను నమ్మించటంలో తమ గురుతరమైన పాత్రను మేధావి బృందాలతో కలిసి నిర్వర్తించారు. సదరు మేధావులకు తమ వ్యక్తిగత ప్రయోజనాలు, ఫిర్యాదులు తమకుండగా వాటిని తెలంగాణ మేలు అనే ముసుగులో దాచిపెట్టారు. మేధావులకు తెలివి ఎక్కువ గనుక.

అంతవరకు ఎవరు ఆక్షేపించగలది ఏమీ లేదు. ఎవరి అభిప్రాయాలు, ప్రయోజనాల ప్రకారం వారు వ్యవహరిస్తారు. అయితే, తాము అదంతా ప్రజల మేలు కోసం చేస్తున్నామని ప్రకటించినపుడు, ఆ తర్వాతి వ్యవహరణ ఆ ప్రకారం ఉండనట్లయితే మాత్రం, వారి ఒరిజినల్ ఉద్దేశాలనే అనుమానించవలసి వస్తుంది. పైన చెప్పుకున్నట్లు మొదటనే ఉండిన అనుమానాలు నిజమని తేలి బలపడతాయి. ఆ ప్రభుత్వం మారిన తొలి దశలోనే కాకపోయినా, తదనంతర మాసాలలో జరుగుతూ వస్తున్న పరిణామాలను గమనించినప్పుడు, జరుగుతున్నది అదే.

> **అటువంటి పరిణామాలలో అన్నింటికన్న ముఖ్యమైనది రైతుల సమస్య కాగా, తర్వాతది నిరుద్యోగులది. అటువంటివి ఇంకా ఉన్నాయి గాని ప్రస్తుతానికి ఈ రెండింటి గురించి చెప్పుకుందాము. రైతుల రుణమాఫీ హామీ ఇచ్చిన ప్రకారం కనీసం ఆగస్టు 15 గడువు ప్రకారమైనా జరగలేదు. ఇంకా మిగిలిపోయిన రైతులు సగం వరకు ఉండటం ఒకటైతే (ప్రభుత్వ లెక్కల ప్రకారమే) వారి మాఫీకి సంబంధించిన విధి విధానాలు స్పష్టత లేక గజిబిజిగా ఉన్నాయి. రకరకాల ప్రకటనలు వస్తున్నాయి. తలా ఒకటి, రోజుకొకటి చెప్తున్నారు. అనగా ఎప్పటికి తేలేది తెలియదు. ఇది ఒకటైతే, రైతుబంధు, రైతుబీమా, పంటల బోనస్ గురించి అసలు ప్రస్తావనలు లేవు. ప్రస్తుతం ఆందోళనలు, ఆత్మహత్యలు ఆగకుండా సాగుతున్నాయి. వాటితో పాటు వామపక్షాలు, ఎన్జీవోలు, మేధావుల దొంగ నిద్రలు కూడా.**

నిరుద్యోగ సమస్య నిజంగానే తీవ్రమైనది. తన పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొంత చేసినా అసలేమీ చేయలేదని మేధావులు, ఎన్జీవోలు, నిరుద్యోగులు, కమ్యూనిస్టులు సాగించిన ఉధృతమైన ప్రచారాన్ని తట్టుకోలేకపోయింది. ఆ పార్టీ ఓటమికి వీరంతా సంతోషించారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలివ్వగలమనే హామీ కాంగ్రెస్ ఇవ్వగా వీరంతా అవునవునన్నారు. కానీ, ఇంతవరకు ఒక్కటంటే ఒక్క కొత్త ఉద్యోగానికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వకపోగా, బీఆర్ఎస్ అన్ని ప్రక్రియలు పూర్తిచేసిన వాటిని తన ఉద్యోగాలంటూ నిర్భయంగా అబద్ధాలు చెప్తున్నది. ఆ మాటలు అబద్ధమని స్వయంగా నిరుద్యోగులే అంటూ ఆందోళనలు చేస్తే అణచివేస్తున్నది. అయినా, మన మేధావులు, ఎన్జీవోలు, కమ్యూనిస్టులు మాత్రం నోరు తెరవటం లేదు. ఏడాది గడువులో ఇక మిగిలింది కేవలం మూడు నెలలు. అయినా మేధావులు, ఎన్జీవోలు, కమ్యూనిస్టులు తమ దొంగ నిద్ర నుంచి ఎప్పటికి మేల్కొంటారో తెలియటం లేదు.

ప్రాంతీయమే దేశానికి ప్రత్యామ్నాయం

డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రాంతీయ పార్టీల అస్తిత్వ ఉద్యమాలు, ఆత్మగౌరవ నినాదాలు అంటే గిట్టని అంశాలు. ప్రాంతీయ పార్టీలు బలపడినా, హక్కుల కోసం, న్యాయమైన వాటాల కోసం గొంతెత్తి నినదించినా జాతీయ పార్టీలు సహించలేవు. బీఎస్పీ, సీపీఐ (ఎం), ఆప్, ఎన్సీపీలకు సాంకేతికంగా జాతీయ పార్టీ హోదా ఉన్నా.. అవి దేశ వ్యాప్తంగా విస్తరించిలేవు. ఇక ఆసేతు హిమాచలం కనిపించే బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రాంతీయ పార్టీల పట్ల తీవ్ర వ్యతిరేకతను కలిగి ఉంటాయి. లొంగిపోని ప్రాంతీయ పార్టీలను సమయం వచ్చినప్పుడు నామరూపాల్లేకుండా చేయడానికి కూడా అవి వెనుకాడవు. నాలుగు దశాబ్దాలుగా ప్రాంతీయ పార్టీల పుణ్యమా అని ఉనికిని కాపాడుకుంటూ కేంద్రంలో చక్రం తిప్పుతున్న ఈ రెండు పార్టీలే వాస్తవాన్ని, పునాదిని మరిచి ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేయడానికి, నిస్తేజపరచడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 20 ఏండ్ల పాటు కేంద్రంలో, రాష్ట్రాల్లో కాంగ్రెస్‌దే ఆధిపత్యం.1957లో కేరళలో అవిభక్త సీపీఐ అధికారంలోకి వచ్చినా దేశవ్యాప్త రాజకీయాల్లో గుణాత్మక మార్పు వచ్చింది మాత్రం 1967లోనే. ఆ సంవత్సరం వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ శక్తులు అధికారంలోకి వచ్చాయి. ఆ ప్రకంపనలు మరో పదేండ్ల తర్వాత ఏకంగా ఢిల్లీనే తాకాయి. 1977లో తొలిసారిగా కేంద్రంలో మొరార్జీ దేశాయ్ నేతృత్వంలో జనతా పార్టీ ప్రభుత్వం కొలువుదీరింది. కాంగ్రెస్ కుటిలనీతి వల్ల ఆ ప్రభుత్వం 28 నెలలకు, ఆ తర్వాత చరణ్‌సింగ్ సర్కార్ ఆరు నెలలకే కుప్పకూలిపోయాయి. జనతా పార్టీ ముక్కలు చెక్కలు అయిపోయింది. ఆ తర్వాతి కాలంలో వీపీ సింగ్, చంద్రశేఖర్, దేవేగౌడ, గుజ్రాల్ ప్రధానులుగా పనిచేసినా వీరంతా కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలకు చెందినవారు కావడంతో పూర్తికాలం పాలించలేకపోయారు. విశేషమేమిటంటే.. వాజపేయి, మన్మోహన్ సింగ్ మాత్రం సొంత మెజారిటీ లేకుండానే పూర్తికాలం ప్రభుత్వాలను నడిపించారు. అదీ ఆ రెండు పార్టీల చాణక్యం.

స్వతంత్ర భారత చరిత్రలో కాంగ్రెస్ 54 ఏండ్లు, బీజేపీ 16 ఏండ్లు సంపూర్ణంగానో, సంకీర్ణంగానో పరిపాలించాయి. ఇతర పార్టీల ప్రభుత్వాలు ఏడేండ్లు మాత్రమే పాలించగా.. ఆ ప్రభుత్వాల పతనాల వెనుక కాంగ్రెస్, బీజేపీల కపట నాటకాలు దాగి ఉన్నట్టు చరిత్ర చెప్తున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రాంతీయ పార్టీల సంకీర్ణాలకు దేశాన్ని పాలించే సత్తా లేదన్న దుష్ప్రచారాన్ని దేశవ్యాప్తంగా పథకం ప్రకారం వ్యాప్తి చేయడంలో ఆ రెండు పార్టీలు కలిసి నడిచాయి. ఆ ప్రచారమే ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ జరిగింది. ఫలితంగా తాజా లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక శాతం ప్రజలు ఎన్డీయే వైపో, ఇండియా కూటమి వైపో చీలిపోయారు. దీంతో ఆ రెండు కూటములకు దూరంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు చేదు అనుభవాన్ని రుచిచూశాయి. హిందూత్వ పక్షాన మోదీ (ఎన్డీయే కూటమి), లౌకికవాదం పక్షాన రాహుల్ (ఇండియా కూటమి) మల్లయోధులుగా జబ్బలు చరుస్తూ అరచిన పెడబొబ్బల హోరులో ప్రాంతీయ అస్తిత్వ, ఆత్మగౌరవ నినాదాలు వినపడకుండా పోయాయి. సామంత రాజులను స్వాధీనం లోకి తెచ్చుకోవడానికి రాచరిక వ్యవస్థలో చక్రవర్తులు సామ, దాన, భేద దండోపాయాలను ప్రయోగించినట్టే.. ప్రత్యర్థి ప్రాంతీ య పార్టీలను, ప్రభుత్వాలను వీలైతే లొంగదీసుకోవడానికి, కాకుంటే తుంగలో తొక్కడానికి గవర్నర్, సీబీఐ, ఈడీ, ఐటీ వ్యవస్థలను ఉపయోగించుకున్న కాంగ్రెస్ సంస్కృతిని పెంచిపోషించిన మోదీ అనుకున్నది సాధించారు.

'మీకు మేమే దిక్కు' అని హుంకరిస్తున్న ఈ రెండు ఆధిపత్య జాతీయ పార్టీలకు అంత బలం ఉందా? ప్రాంతీయ శక్తుల సహకారం లేకుండా ఒంటరిగా అవి కేంద్రంలో అధికారం లోకి రాగలవా? అన్న ప్రశ్నలకు లేదనే సమాధానం చరిత్ర చెప్తున్నది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ కేవలం 215 సీట్లలోనే ప్రాంతీయ శక్తుల ప్రమేయం లేకుండా తలపడ్డాయి. వీటిలో 162 చోట్ల బీజేపీ గెలిస్తే, కాంగ్రెస్ 53తో సరిపెట్టుకుంది. అంటే బీజేపీ గెలిచిన 240 సీట్లలో 78, కాంగ్రెస్ గెలిచిన 99 సీట్లలో 45 ప్రాంతీయ రాజకీయ శక్తుల మద్దతు పుణ్యమా అని వచ్చినవే కదా. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న ప్రధాని మోదీ క్యాబినెట్‌లో కూడా అప్నా దళ్(ఎస్), హిందుస్థాన్ ఆవాం మోర్చా(ఎస్) ఒక్కొక్క లోక్‌సభ సీటే గెలిచినా, రాష్ట్రీయ లోక్‌దళ్, జేడీ(ఎస్) రెండు సీట్ల చొప్పున గెలిచినా, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఏ)కు లోక్‌సభలో ప్రాతినిధ్యం లేకున్నా ఏరి కోరి వీరందరికీ కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించారంటేనే బీజేపీ ఎంత బలహీనంగా ఉందో విదితమవుతున్నది.

ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మెజారిటీ రాదని, ప్రాంతీయ శక్తులే కేంద్రంలో చక్రం తిప్పుతాయని లోక్‌సభ ఎన్నికలకు చాన్నాళ్ల ముందుగానే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గ్రహించారు. ఆ విషయాన్ని ప్రాంతీయ పార్టీలకు చెవినిల్లు కట్టుకుని చెప్పారు. రెండు జాతీయ పార్టీలను ఎండగడుతూ ప్రాంతీయ శక్తులను ఒక్క తాటి మీదికి తీసుకురావడానికి విశ్వప్రయత్నం చేశారు. ప్రాంతీయ శక్తులన్నీ ఏకమైతే బీజేపీ, కాంగ్రెస్‌లను మట్టి కరిపించి కేంద్రంలో అధికారంలోకి రావడం సాధ్యమేనని చెప్పారు. ప్రాంతీయ పార్టీలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని ఆయన ఆశించారు. కానీ, అది జరగలేదు. మరోవైపు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైపు మోహరించిన ప్రాంతీయ పార్టీలకు వ్రతం చెడ్డా ఫలం దక్కలేదు. ప్రధానిగా, ప్రతిపక్ష నేతగా బీజేపీ, కాంగ్రెస్ అధినేతలే సింహాసనాల్లో కొలువుతీరారు. వారికి మద్దతు ఇచ్చిన ప్రాంతీయ పార్టీలు పల్లకి మోసే స్థాయిలోనే మిగిలిపోయాయి.

> **1989-2014 దాకా ఏడు సార్లు జరిగిన సాధారణ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు మెజారిటీ దక్కలేదు. 2014-24 మధ్య బీజేపీకి మెజారిటీ వచ్చినా అది ప్రాంతీయ పార్టీల సహకారం వల్లే తప్ప సొంతంగా కాదు. ఇప్పుడున్న మోదీ ప్రభుత్వం కూడా పరాధీన ప్రభుత్వమే. ఇది ప్రజలిచ్చిన సంకీర్ణ సంకేతం. ప్రాంతీయ పార్టీల మధ్య బీజేపీ, కాంగ్రెస్ అనుసరిస్తున్న విభజించు, పాలించు సిద్ధాంతమే ఆ రెండు పార్టీల బలం.**

తాత్కాలిక లబ్ధి కోసం వాటిని ఆశ్రయించడమే ప్రాంతీయ పార్టీల బలహీనత. ప్రస్తుత లోక్‌సభలో బీజేపీ బలం 240, కాంగ్రెస్ బలం 99 కాగా.. ఇతర పార్టీల బలం 204. ఈ 204 మంది లోక్‌సభ సభ్యులు ఒక్కటై 'మేమే అధికారం చేపడతా'మంటే పరిస్థితి ఇంకో రకంగా ఉండేది కాదా? 1998, 1999లో వాజపేయి, 2004, 2009లో మన్మోహన్ సింగ్ అతి తక్కువ సీట్లతోనే ప్రధాని కాలేదా? అలాంటప్పుడు లోక్‌సభలో 204 మంది సంఖ్యా బలమున్న పార్టీలు ప్రధాని పీఠాన్ని అధిరోహించలేవా? పొంచి ఉన్న ఈ ప్రమాదాన్ని గమనించిన బీజేపీ, కాంగ్రెస్‌లు మెజారిటీ ప్రాంతీయ పార్టీలను అస్తిత్వం, ఆత్మగౌరవం, అభివృద్ధి అనే అంశాల నుంచి దృష్టి మరల్చి హిందూత్వ, లౌకిక అంశాలు తప్ప ప్రజలకు వేరే సమస్యలే లేనట్టు భ్రమలు కల్పించి తప్పుదారి పట్టించడంలో, దారికి తెచ్చుకోవడంలో తాత్కాలిక విజయం సాధించాయి.

ఒంటరి పోరాటం చేస్తున్న ప్రాంతీయ పార్టీలను, ప్రధానంగా బీఆర్ఎస్‌ను మింగేయడానికి ఆ రెండు జాతీయ పార్టీల అనకొండలు పొంచి చూస్తున్నాయి. బీఆర్ఎస్‌ను లేకుండా చేస్తే మిగతా వాటిని మట్టుపెట్టడం పెద్ద సమస్య కాదని వాటి భావన. ఆ వ్యూహంలో భాగంగానే తెలంగాణలో చీకటి ఒప్పందాలు చేసుకొని బీఆర్ఎస్‌ను దెబ్బతీశాయి. ఎన్నికల అనంతరం కూడా బీఆర్ఎస్ లక్ష్యంగా పనిచేస్తున్నాయి. వాస్తవానికి రాజకీయంగా బీజేపీ, కాంగ్రెస్ బద్ధ శత్రువులు. కానీ, తెలంగాణలో మాత్రం మిత్రులు. రేవంత్ సర్కార్ వైఫల్యాలను బీజేపీ కనీసం వేలెత్తిచూపదు. రేవంత్ సైతం బీజేపీని పల్లెత్తు మాట అనరు. ఈ రెండు పార్టీలు కలిసి బీఆర్ఎస్‌పై దాడిచేస్తాయి. ఇదెక్కడి